ధరణి పెండింగ్ దరఖాస్తులకు పది రోజుల్లో పరిష్కారం

• కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట, జూన్ 14 : సూర్యాపేట జిల్లాలో 7,093 ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని పది రోజుల్లో పరిష్కరిస్తామని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ తెలిపారు. శుక్రవారం సీసీఎల్‌ఏ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పెండింగ్ దరఖాస్తులను వేగంగా పర్కిరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇప్పటికే మండల, డివిజన్ స్థాయిల్లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించడం జరుగుంతుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఆర్డీఓ వేణుమాదవ్, తాసీల్దార్ శ్యామ్ సుందర్‌రెడ్డి, కృష్ణయ్య, సంఘమిత్ర పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి

• డీఎంహెచ్ఓ డాక్టర్ కోటాచలం

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ కోటాచలం

బొడ్రాయిబజార్, జూన్ 14 : రక్తదానం చేసిన ప్రతి ఒక్కరూ ప్రాణ దాతలు కావాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కోటాచలం, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ జయలత, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ అనుసూయి అన్నారు. ప్రపంచ రక్తదాత దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. రక్తదానం మహా గొప్ప దానమని మనం ఇచ్చిన రక్తం ఎంతో మంది ప్రాణాలను కాపాడుతుందన్నారు. ఆరోగ్యవంతంగా ఉన్న ప్రతి యువకుడు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింహ, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నాజియా, బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి నజీబా, డాక్టర్లు గిరిధర్, రమేశ్‌నాయక్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

రక్తదానం సామాజిక బాధ్యత : మైహోం ప్లాంట్ హెడ్ శ్రీనివాస్‌రావు

మేళ్లచెర్వు : రక్తదానం సామాజిక బాధ్యతగా తీసుకోవాలని మై హోం ప్లాంట్ హెడ్ శ్రీనివాస్‌రావు అన్నారు. పరిశ్రమ ఆవరణలో కోదాడకు చెందిన తిరుమల హాస్పిటల్ వారిచే నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో జీఎం నాగేశ్వర్‌రావు, డాక్టర్ సాయికిరణ్, హెల్త్ ఆఫీసర్ శ్రీను, ఏజీఎం శ్రీనివాస్, ఉద్యోగులు పాల్గొన్నారు.

సమీకృత వ్యవసాయంతో లాభాలు

• జిల్లా ఉద్యాన అధికారి నాగయ్య

నిరిపురంలో రైతు శేఖుకుమార్ వ్యవసాయ పొలాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారి నాగయ్య

నడిగూడెం, జూన్ 14 : సమీకృత వ్యవసాయంతో లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యాన అధికారి తీగల నాగయ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సిరిపురంలోని రైతు వాసికర్ల శేఖుకుమార్ వ్యవసాయ పొలాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. సమీకృత వ్యవసాయంతో పెట్టుబడి ఆదా అవుతుందన్నారు. ఈ సందర్భంగా సమీకృత వ్యవసాయంపై పలువురు రైతులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట సూర్యాపేట డివిజన్ ఉద్యాన అధికారి జగన్, రైతు శేఖుకుమార్ ఉన్నారు.

కల్మల్ చెరువు లింక్ రోడ్డు పరిశీలన

కల్మల్‌చెరువుకు లింక్‌రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

గరిడేపల్లి, జూన్ 14 : మండలంలోని కల్మల్‌చెరువు గ్రామం నుంచి చుట్టూ వివిధ గ్రామాలకు వెళ్లేందుకు ఉన్న లింక్ రోడ్డులను తారు రోడ్డులుగా మార్చేందుకు గాను రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇటీవల నిధులు మంజూరు చేయించగా శుక్రవారం పలువురు పంచాయితీరాజ్ శాఖాధికారులు ఆయా రోడ్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కల్మల్‌చెరువు నుంచి చెవ్వారిగూడెం, గానుగుబండ, సీత్లాతండా, సోమ్లాతండా, బొత్తలపాలెం, పాలకవీడుకు గల లింక్‌రోడ్డులను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనుల ప్రారంభానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. పరిశీలించిన వారిలో పంచాయితీరాజ్ ఎస్ఈ రామకృష్ణ, ఈఈ వెంకటయ్య, డీఈ కోటిరెడ్డి, ఏఈ ప్రదీప్ ఉన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు

• ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశ్

వీధి వ్యాపారులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశ్

కోదాడ రూరల్, జూన్ 14 : పట్టణ ప్రజల రాకపోకలకు, వాహనదారులకు రోడ్డు పక్క వ్యాపారులు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశ్ అన్నారు. శుక్రవారం పట్టణంలో రోడ్డు పక్క పూల వ్యాపారం నిర్వహించే దుకాణదారులకు ట్రాఫిక్ నియంత్రణపై అవగాహన కల్పించి మాట్లాడారు. నిబంధనలు మించి తమ దుకాణాలను రోడ్డు పైకి తెచ్చిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ కొంగల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఎస్ఐ మానవత్వం

కోదాడ పట్టణ బస్టాండ్ సెంటర్ ప్రధాన రహదారిపై ఓ వ్యక్తి స్పృహ కోల్పోయి పడిఉన్నాడు. వాహనదారులు, పాదచారులు చూస్తూ వెళ్తున్నారే తప్ప ఆ వ్యక్తిని పట్టించుకోలేదు. ఆ సమయంలో అటుగా వచ్చిన ట్రాఫిక్ ఎస్ఐ మల్లేశ్ సదరు వ్యక్తిని గమనించి 108కు సమాచారం అందించి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆలయ ఈఓ

వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

బొడ్రాయిబజార్, జూన్ 14 : ఈ నెల 28 నుంచి జూలై 3 వరకు జిల్లా కేంద్రంలోని వేణుగోపాలస్వామి దేవాలయంలో నిర్వహించి స్వామి వారి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ ఈఓ సీహెచ్.వెంకటనారాయణ, ఆలయ అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల మురళీధరచార్యులు కోరారు. ఈ మేరకు శుక్రవారం దేవాలయం ఆవరణలో ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 26న ఉత్సవ ప్రారంభం, జూలై 1న స్వామి వారి కల్యాణం, 2న గరుడ సేవా శోభాయాత్ర, 3న పూర్ణాహుతి, 12 సేవలు, 12 ఆరగింపుల కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు.

పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

• జిల్లా అదనపు కలెక్టర్ ప్రియాంక

గరిడేపల్లి : కేతవారిగూడెం జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందజేస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ ప్రియాంక

గరిడేపల్లి, జూన్ 14 : ప్రభుత్వం విద్యార్థులకు అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత స్థితికి చేరుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ సీహెచ్.ప్రియాంక అన్నారు. మండలంలోని కేతవారిగూడెం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫామ్‌ను ఎంపీపీ పెండెం సుజాతాశ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉంటారని, అక్కడే గుణాత్మకమైన విద్య అందుతుందన్నారు. కావున విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చదివించి ప్రభుత్వం అందజేస్తున్న అన్ని సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తదుపరి పాఠశాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డులను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి బి.శ్యామ్‌ప్రసాద్, తాసీల్దార్ బి.కవిత, ఇన్‌చార్జి ఎంపీడీఓ వనజ, ఎంఈఓ పి.చతృనాయక్, ఎంపీటీసీ మున్నీసాబేగం చాంద్‌మియా, ఎంపీఓ మూలానా, ఏపీఎం శ్రీనివాస్, ఎన్ఎస్‌పీ ఏఈ కుర్మయ్య, ఏపీఓ సురేశ్, పాఠశాల హెచ్ఎంలు సువర్ణ, ఉమ, సీఆర్పీలు అశోక్, రామకృష్ణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య : ఎంఈఓ శాంతయ్య

తిరుమలగిరి : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ శాంతయ్య అన్నారు. తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని ఈదులపర్తెందాలో పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని తెలిపారు. ఆయన వెంట తిరుమలగిరి కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాస్ ఉన్నారు.

వెంపటిలో సామూహిక అక్షరాభ్యాసం

తుంగతుర్తి : బడి బాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని వెంపటి ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతిలో చేరిన విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం చిత్తలూరి వెంకట్రామనర్సమ్మ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కొరుకొప్పుల ఉమారాణి, ఉపాధ్యాయ బృందం భీవనపల్లి శ్రీనివాస్, పాలకుర్తి యల్లయ్య, జ్యోతి, మల్లెపాక రవీందర్, రమాదేవి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాగారం : మండలంలోని ఫణిగిరి గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు హెచ్ఎం నారాయణ దుస్తులు, పాఠ్య పుస్తకాలు అందజేశారు. అలాగే ఇంగ్లీష్ వ్యాకరణం, బాషా స్పీచ్ పెంచడం, వకాబులరీ పెంచడం కోసం ఇంగ్లీష్ పుస్తకాలను టీచర్లకు ఫణిగిరిలో బోధిసత్వ ఫౌండేషన్ అధ్యక్షుడు పులిగిల్ల వీరమల్లుయాదవ్ ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలునాయక్, రమేశ్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

నూతనకల్ : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం విద్యాసాగర్, ఉపాధ్యాయుడు రేపాక లింగయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

మేళ్లచెర్వు : మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో బడిబాట కార్యక్రమం ముమ్మరంగా సాగింది. పాఠశాలలకు వచ్చిన విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మఠంపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని ఎంఈఓ పానుగోతు చత్రునాయక్ అన్నారు. మండలంలోని పెదవీడు జడ్పీహెచ్ఎస్‌లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం వేడుకలను ఎంపీడీఓ జానకిరాములు, తాసీల్దార్ మంగతో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి వేణుగోపాల్, అల్లీపురం కాంప్లెక్స్ హెచ్ఎం శేషిరెడ్డి, ఏపీఎం సొజన్య, ప్రధానోపాధ్యాయులు పీవీ దుర్గాప్రసాద్, చంద్రశేఖర్, సీఆర్పీ నాగమణి, రంగారావు, ఏపీసీ చైర్మన్లు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చిన్నారులను చేర్పించాలి : కౌన్సిలర్ సరిత

నేరేడుచర్ల : ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ చిన్నారులను చేర్పించి వాటి బలోపేతానికి కృషి చేయాలని 8వ వార్డు కౌన్సిలర్ కొదమగుండ్ల సరిత అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని శాంతినగర్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన అక్షరాభ్యాసం ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎం అనసూర్య, ఉపాధ్యాయురాలు వహీదా, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్ల బలోపేతానికి కృషి చేయాలి

• ఏసీడీపీఓ శ్రీజ

చిన్నారులకు పలకలు అందజేస్తున్న ఐసీడీఎస్ ఏసీడీపీఓ శ్రీజ

బొడ్రాయిబజార్, జూన్ 14 : అంగన్‌వాడీ సెంటర్ల బలోపేతానికి అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు కృషి చేయాలని ఐసీడీఎస్ అడిషనల్ సీడీపీఓ శ్రీజ అన్నారు. శుక్రవారం పట్టణంలోని 20వ వార్డులో అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను చిన్నారులను, తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 0-5 సంవత్సరాల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పోషకాహారాలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాలను కాపాడుకోవాలన్నారు. అనంతరం వెలుగు కళమ్మ, బాబుల మనుమరాలు తమ్మెశ్రీ పుట్టిన రోజు సందర్భంగా వార్డులోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలకు పలకలు పంపిణీ చేయగా వాటిని చిన్నారులకు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అన్నపర్తి రాజేశ్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ నగిత, అంగన్‌వాడీ టీచర్లు భరణి, పద్మ, అనిలమ్మ, వెలుగు వినీత్, ఏఎన్ఎం ఉమా పాల్గొన్నారు.

అక్కలదేవిగూడెంలో వైద్య శిబిరం

అక్కలదేవిగూడెంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రియాంక

చివ్వెంల, జూన్ 14 : మండలంలోని అక్కలదేవిగూడెంలో శుక్రవారం సూర్యాపేటకు చెందిన ఆర్వీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్నవారికి మందులు పంపిణీ చేశారు. అక్కలదేవిగూడెంతో పాటు హలావత్‌తండా, జయరాంగుడితండాకు చెందిన సుమారు 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ బెల్లంకొండ ప్రియాంక తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ బి.క్రాంతి, బెల్లంకొండ రామ్మూర్తి, గ్రామస్తులు పుట్ట వెంకటేశ్వర్లు, వెంకన్న, శ్రీకాంత్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర

• వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు

ఉపాధి కూలీలతో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు

నేరేడుచర్ల, జూన్ 14 : ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.ధనుంజయనాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని బోడలదిన్న గ్రామంలో ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిసారి ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేస్తామని అంటున్నాడని, ఈ పథకం రద్దు కాకుండా సీపీఐ పోరాటం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం, పట్టణ, మండల సీపీఐ కార్యదర్శులు కత్తి శ్రీనివాస్‌రెడ్డి, యల్లబోయిన సింహాద్రి పాల్గొన్నారు.

కోనాయిగూడెంలో దేవాలయాల వార్షికోత్సవం

కోనాయిగూడెంలో పూజలు చేస్తున్న భక్తులు

గరిడేపల్లి, జూన్ 14 : మండలంలోని కోనాయిగూడెం గ్రామంలో కనకదుర్గమ్మ, అంకాలమ్మ, పోతురాజు, అభయాంజనేయ స్వామి విగ్రహాల ప్రతిష్ఠ జరిగి సంవత్సరం అయినందున శుక్రవారం గ్రామస్తులు ప్రథమ వార్షికోత్సవ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు బోనాలు ఎత్తుకుని మేళతాళాల నడుమ ఊరేగింపుగా దేవాలయాల వద్దకు వెళ్లి నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్న తాసీల్దార్ సురేందర్‌రెడ్డి

చింతలపాలెం, జూన్ 14 : ప్రభుత్వ నూతన కార్యాలయాల ఏర్పాటుకు మండల కేంద్రంలో గల చింతలపాలెం రెవెన్యూ శివారులోని సర్వే నంబర్ 24లో గల 3 ఎకరాల స్థలాన్ని శుక్రవారం తాసీల్దార్ సురేందర్‌రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరాల కొండారెడ్డి, నాయకులు ఇంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పంటల వివరాలు నమోదు చేయాలి

• ఏఓ మురళీబాబు

నూతనకల్, జూన్ 14 : వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో మండలంలోని రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను విధిగా సేకరించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి మురళీబాబు ఏఈఓలకు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏఈఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులు సాగు చేసే పంటల వివరాలు క్షేత్ర సందర్శన చేయాలన్నారు. రైతులకు ఏదైన సందేహాలు ఉంటే నివృత్తి చేయాలని సూచించారు. నకిలీ విత్తనాలు విక్రయించకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. దుకాణాల్లో విత్తనాలు, ఎరువులు, స్టాక్ వివరాలు ప్రదర్శించేలా చూడాలన్నారు. సమావేశంలో ఏఈఓలు జానయ్య, శ్రావణి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

• డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు ఆదినారాయణ

మేళ్లచెర్వు, జూన్ 14 : మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, అటవీ, భూదాన భూములను కాపాడాలని డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు బావన ఆదినారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన డీవైఎఫ్ఐ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని ఈ సందర్భంగా కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు.

చెన్నాయిపాలెంలో రామాలయ నిర్మాణ పనులు ప్రారంభం

మఠంపల్లి, జూన్ 14 : మండలంలోని చెన్నాయిపాలెం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయం, ఆంజనేయస్వామి నూతన దేవాలయ స్లాబ్ పనులను కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భూక్య మంజూనాయక్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో దేవాలయాల నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పై తండా, కింది తండా సర్పంచులు బానోతు నాగూనాయక్, భూక్య భరత్‌నాయక్, భూక్య గోవర్ధన్‌నాయక్, రాహుల్‌నాయక్, ఈశ్వర్‌నాయక్ పాల్గొన్నారు.

రోగిపై హాస్పిటల్ అటెండర్ దాడి

గాయపడ్డ రోగి లక్ష్మయ్య

మఠంపల్లి, జూన్ 14 : చికిత్స కోసం వెళ్లిన రోగిపై అటెండర్ దాడి చేసిన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం జరిగింది. మండల కేంద్రానికి చెందిన కాసాని లక్ష్మయ్య వ్యవసాయ పనులు చేస్తుండగా చేతికి గాయమైంది. దాంతో చికిత్స కోసం మఠంపల్లిలోని ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లాడు. ఆ సమయంలో డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో చేతికి కట్టు కట్టే విషయంలో అటెండర్ వీరాస్వామికి లక్ష్మయ్యకు వాగ్వాదం చేటుసుకున్నది. దాంతో అటెండర్ రోగిని దుర్భాషలాడి కొట్టినట్లుగా సమాచారం.

వ్యక్తి అదృశ్యం

చింతలపాలెం, జూన్ 14 : మండలంలోని దొండపాడు గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యమైన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దొండపాడు గ్రామానికి చెందిన దొంగల నాగేశ్వర్‌రావు ఈ నెల 4న ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు బంధువులు, చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినప్పటికీ అచూకీ లభించకపోవడంతో అతని కుమారుడు కార్తీక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నాగారానికి చేరిన మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అభిమానుల పాదయాత్ర

అర్వపల్లిలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అభిమానులకు స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

నాగారం, జూన్ 14 : సూర్యాపేట ఎమ్మెల్యేగా గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి వరుసగా మూడోసారి గెలుపొందిన సందర్భంగా ఆయన అభిమానులు జిల్లా కేంద్రం నుంచి చేపట్టిన పాదయాత్ర శుక్రవారం నాగారం మండల కేంద్రానికి చేరుకున్నది. చివ్వెంల మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన జగదీశ్‌రెడ్డి అభిమానులు తిప్పాని సుధీర్‌రెడ్డి, ఎల్క హరీశ్‌రెడ్డి, స్టాలిన్, సందీప్‌రెడ్డి, శ్రీను, జాని, పృథ్వీరాజ్, మట్టి వేణు, చింత రవి, సందీప్ చేపట్టిన పాదయాత్ర నాగారానికి చేరుకోగా గ్రామ మాజీ సర్పంచ్ చిప్పలపల్లి రాములు, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎలుక సైదులు వారిని ఘనంగా సన్మానించారు. పాదయాత్రకు స్వాగతం పలికిన వారిలో మాజీ ఎస్ఎంసీ చైర్మన్ చిప్పలపల్లి మల్లేశ్, దేవరకొండ మురళి, పరశురాములు, రాజు, భానుప్రసాద్, శ్రీను ఉన్నారు.

అర్వపల్లిలో ఘన స్వాగతం

అర్వపల్లి : మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అభిమానులు సూర్యాపేట నుంచి యాదగిరిగుట్ట వరకు చేపట్టిన పాదయాత్ర అర్వపల్లికి చేరుకోగా బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి పాదయాత్ర కొనసాగించారు.

సీతా పబ్లిక్ స్కూల్ యాజమాన్యానికి నోటీసులు జారీ

పాఠశాల రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంఈఓ సైదానాయక్

చింతలపాలెం, జూన్ 14 : మండల కేంద్రంలో గల సీతా పబ్లిక్ స్కూల్ యాజమాన్యానికి ఎంఈఓ సైదానాయక్ నోటీసులు జారీ చేశారు. శుక్రవారం స్కూల్‌కి వెళ్లి రికార్డులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. కొన్ని రోజులుగా పలు పత్రికల్లో పాఠశాలపై వస్తున్న కథనాల ఆధారంగా విచారణ చేపట్టడం జరిగిందన్నారు. 2019లో గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా తప్పుడు ఎన్ఓసీ సర్టిఫికెట్‌ను సృష్టించి, సెక్షన్ బి బ్లాక్‌ను నిర్మించి పాఠశాలను నిర్వహిస్తున్నారని చింతలపాలెం యువకులు పది మంది లిఖిత పూర్వకంగా ఫిర్యాదు ఇవ్వడం జరిగిందన్నారు. సెక్షన్-బి బ్లాక్ నిర్మాణానికి సంబంధించి మూడు రోజుల్లో పూర్తి సమాచారం ఇవ్వాలని లేనియెడల శాఖ పరమైన చర్యలు ఉంటాయని యాజమాన్యానికి తెలిపారు. అనంతరం మంగళవారం డీఈఓ, ఎంపీడీఓ సమక్షంలో విచారణ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

మలిదశ ఉద్యమకారులకు పింఛన్ ఇవ్వాలి

• బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్

హుజూర్‌నగర్‌లో మాట్లాడుతున్న బీసీ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాస్

హుజూర్‌నగర్, జూన్ 14 : మలిదశ ఉద్యమకారులకు ప్రతి నెలా రూ.5 వేల పింఛన్ అందజేయాలని బీసీ సంక్షేమ సంఘం హుజూర్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడు ధూళిపాల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో మలిదశ ఉద్యమకారులు కీలక పాత్ర పోషించారని, వారి సేవలను గుర్తించి పింఛన్ అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో బీసీ నాయకులు గోవిందరావు, అంజి, వెంకటేశ్వర్లు, నరసింహాచారి, కృష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యను పరిరక్షించాలి

• పీడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు

మాట్లాడుతున్న పీడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు

బొడ్రాయిబజార్, జూన్ 14 : మూసివేసిన ప్రభుత్వ పాఠశాలలను, హాస్టళ్లను తెరిచి మౌలిక వసతులు కల్పించాలని పీడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆవ